మద్యం దుకాణాలకు 419 దరఖాస్తులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 94 వైన్‌షాపుల లైసెన్స్‌ల కోసం ఇప్పటి వరకు మొత్తం 419 దరఖాస్తులు అందాయని కరీం నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం 186 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు చివరి గడువు ఉందని తెలిపారు.



ఓటరు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

కరీంనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పెండింగ్‌లో ఓటరు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పెండింగ్ ఫారం -6,7,8 దరఖాస్తులకు సంబంధించి నోటీస్ పీరియడ్ జారీ చేసి ఏడు రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ప్రతి పోలింగ్ బూత్‌కు బూత్‌స్థాయి అధికారి(బీఎల్‌వో)ని నియమించి, గుర్తింపు కార్డు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, లక్ష్మికిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీసులకు సీపీఆర్‌పై శిక్షణ

సీపీ గౌస్ ఆలం



సీపీఆర్‌ను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వంటి అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు అవలంబించాల్సిన సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిసికేషన్) పద్ధతిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పోలీసు కమిషనర్ గౌస్‌ఆలం అన్నారు. ఈనెల 13 నుం చి 17 వరకు జరుగుతున్న సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్‌లో పోలీసు అధికారులకు, సిబ్బందికి కంటి పరీక్షలతోపాటు సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సమాజంలో ఫస్ట్ రెస్పాండర్‌గా పోలీసులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ముఖ్యంగా బ్లూ కోల్ట్స్ అధికారులు వెంటనే స్పందించి సీపీఆర్ చేసినట్లయితే ప్రాణాలను రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఇతరులకు, కుటుంబ సభ్యులకు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, అడిష నల్ డీసీపీ వెంకటరమణ, భీంరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ సనా, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది



చొప్పదండి మార్కెట్‌లో మక్కలు

మక్కలకు లభించని మద్దతు

- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకు అమ్ముకుంటున్న రైతులు

చొప్పదండి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర లభించక మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న పంట కోతలు ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు మార్క్ ఫెడ్‌లో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దళారులకు తక్కువ ధరకే మక్కలను అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మక్కల మద్దతు ధర క్వింటాలుకు 2,225 రూపాయలు ఉండగా ఈసారి మరో 175 రూపాయలు పెంచి 2,400 రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధరకన్నా తక్కువ ధరకే వ్యాపారులు మక్కలను కొనుగోలు చేస్తున్నారు. 1,800 నుంచి 2,100 రూపాయలు క్వింటాలుకు చెల్లిస్తున్నారు.

చొప్పదండి మార్కెట్‌లో ప్రతి ఏటా 50 వేల క్వింటాళ్ల వరకు మక్కల విక్రయాలు జరుగు తుంటాయి. చొప్పదండితోపాటు రామడుగు, గంగాధర, జూలపల్లి, ధర్మారం, ఎలిగేడు మండలాల నుంచి రైతుల మక్కలను మార్కెట్ కు తీసుకువస్తుంటారు. ఆశించిన మేరకు పంట దిగుబడి రాలేదని, మక్కల్లో తేమ అధికంగా ఉందని వ్యాపారులు ధరను తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- గన్నేరువరం: ఆరుతడి పంటలైన మొక్కజొన్న పంటను పండించిన రైతులు కొనుగోలు కేంద్రం లేక ఇబ్బంది పడుతున్నారు. రైతులు చెన్నలోనే మక్కలను ఆరబెడుతున్నారు. వర్షాలు పడితే నష్ట పోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 800 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. పంట చేతికి వచ్చి 15 రోజులు కావస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. దీంతో ధాన్యాన్ని కొందరు రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నారు.



గన్నేరువరం మండలం పారువెల్లలో తూకానికి సిద్ధంగా ఉన్న మక్కలు

డిసెంబరు 9లోగా హామీలను నెరవేర్చాలి

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 9లోగా నెరవేర్చాలని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని టీఎన్‌జీవోస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన పీఆర్‌టీయూటీఎస్ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీ, డీఏ పెండింగ్ బిల్లులన్నింటిని వంద రోజుల్లో ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రతీ నెల ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం మినహా మిగిలిన హామీలేవీ నెరవేర్చలేదని విమర్శించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావలసిన బెనిఫిట్స్‌ను సంవత్సరాల కొద్దీ పెండింగ్‌లో పెట్టి వారిని తీవ్ర ఇబ్బంది పెడుతున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

30 సంవత్సరాలు కడుపు కట్టుకుని పైసాపైసా కూడగట్టి దాచుకున్న సొమ్మును కూడా ప్రభుత్వం ఇవ్వక పోవడం ఉద్యోగుల హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. కొంత మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక పరిస్థితి బాగాలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబరు 9లోగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే కలిసివచ్చే సంఘాలతో కలిసి ఉద్యమ కార్యాచరణను పీఆర్టీయూ ప్రకటిస్తుందని తెలిపారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని సీనియర్లనే ఎంఈవోలుగా నియమించేందుకు సంబంధించిన ఇచ్చే ఉత్తర్వులు త్వరలో వస్తాయని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం పక్షాన చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జయపాల్‌రెడ్డి నివేదికను సమర్పించారు. అనంతరం పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ భీక్షంగౌడ్, ఆడిట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రాఘవరెడ్డి, తిరుపతిరెడ్డి, జమీల్, దారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

22న జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను ఈ నెల 22న కరీంనగర్ మంకమ్మతోట ధన్గర్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ బాధ్యులు అంతటి శంకరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో బాలబాలికలు, స్త్రీ పురుషులకు ఈ పోటీ లను నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 31 నుంచి హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 22న మధ్యాహ్నం 2 గంటలకు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు ఫోటోలతో పోటీలకు హాజరుకావాలన్నారు. వివరాలకు పీడీ వి శ్రీధర్‌రెడ్డిని 9154738375 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు మోగిన నగారా

- ఎన్నికల అధికారిగా డీసీవో మనోజ్‌కుమార్
- 12 డైరెక్టర్ పోస్టుల్లో ఒకటి ఎస్సీ లేదా ఎస్టీ, రెండు మహిళలకు రిజర్వు
- 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న పరిశీలన... 25న తుది జాబితా విడుదల
- 1న పోలింగ్....అదే రోజు ఫలితాల వెల్లడి

5

రైతులకు నాణ్యమైన విద్యుత్ సేవలు

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని, వ్యవసాయ సర్వీసుల మంజూరు యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేస్తున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మేక రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలో ఈ సంవత్సరం 516 వ్యవ సాయ సర్వీసులను మంజూరు చేశామన్నారు. ప్రతీ వారం, నెలల వారీగా ప్రత్యేకంగా వ్యవసాయ సర్వీసుల మంజూరుపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామని వివరించారు. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. నేరుగా రైతులకు దగ్గరకు వెళ్లి విద్యుత్ సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు 762 పొలంబాట కార్యక్రమాలు చేపట్టామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గణేశ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి 11:30 వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ లావణ్య ఓ ప్రకటనలో తెలిపారు. రామచంద్రాపూర్ కాలనీ, ఆర్‌సీపీ బైపాస్ రోడ్, లేక్ పోలీస్‌స్టేషన్ ఏరియా, సప్తగిరికాలనీ, సాయిబాబా టెంపుల్ రోడ్, అంజనాద్రి ఆలయ ప్రాంతం, శ్రీనగర్ కాలనీ, ఏవోస్ కాలనీ, ఎర్రగుట్ట, పొన్నం కనకయ్య హోటల్ ప్రాంతం, శ్రీ కన్వెన్షన్ హాల్, లహరి అపార్ట్‌మెంట్ ఏరియా, వెంకటాద్రి కాలనీ, మల్లికార్జున వీధి, జానకిరామ్ వీధి, నోబెల్ స్కూల్ ఏరియా, ఏవోస్ కాలనీ పార్క్ ఏరియా, సప్తగిరి టైల్స్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

అభిప్రాయ సేకరణ రసాభాస

- వాగ్వాదాలు, బలప్రదర్శనలతో ఉద్రిక్త పరిస్థితులు
- పరిశీలకులతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభిప్రాయసేకరణ రసాభాసగా మారింది. కాంగ్రెస్ జిల్లా కమిటీ, నగర కమిటీ అధ్యక్షుల నియామకాల కోసం ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని గురువారం కరీంనగర్‌లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. ఏఐసీసీ పరిశీలకులుగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే శ్రీనివాస్ మానే, టీపీసీసీ పరిశీలకులుగా ఆత్రం సుగుణ, చిట్ల సత్యనారాయణ వచ్చారు.

జిల్లా, నగర కమిటీ అధ్యక్ష స్థానాలకు పోటీపడుతున్న నాయకులు భారీగా తమ అనుచరులను డీసీసీ కార్యాలయానికి తీసుకొని వచ్చి పరిశీలకులకు వారి అభిప్రాయాన్ని తెలియజేసేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తన అనుచరులతో కార్యాలయ ఆవరణలోని ఫంక్షన్ హాల్‌కు వచ్చి పరిశీలకులను కలిసేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఫంక్షన్ హాల్ గేట్‌కి తాళం వేశారు. డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి పరిశీలకులు ఉన్న గదిలోనే ఉన్నారు. నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్న వారెవరినీ పరిశీలకులు ఉన్న గదిలోకి అనుమతించవద్దని, వారందరు ఎలా లోపల మీకు దగ్గర కూర్చున్నారంటూ వెలిచాల రాజేందర్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెలిచాల అనుచరులు గేట్ ఎదుట నిలబడి ఆందోళనకు దిగారు.

టీపీసీసీ పరిశీలకురాలు ఆత్రం సుగుణ గేట్ వద్దకు వచ్చి రాజేందర్‌రావుతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన ఆమెతో వాగ్వాదానికి దిగారు. గదిలోపలికి నాయ కులను ఎలా అనుమతించారని నిలదీశారు. తాను లోపలికి రానని, పార్టీ నిబంధనల మేరకు బయటనే ఉంటానన్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

చివరకు ఆత్రం సుగుణ రాజేందర్‌రావుకు గేట్ బయట కుర్చీవేసి కూర్చోమని చెప్పి లోపల ఉన్న నేతలందరిని బయటకు పంపించి అభిప్రాయాలను స్వీకరించారు. రాత్రి ఏడు గంటల సమయంలో పరిశీ లకులు రాజేందర్‌రావును గదిలోపలికి ఆహ్వానించారు. ఆయన అక్కడే ఉండగా అనుచరులు ఒక్కసారిగా గేటును తోసుకొని లోనికి వెళ్లారు. దీనితో ఏఐసీసీ పరిశీలకుడు శ్రీనివాస్ మనె బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. కొందరు నాయకులు అక్కడికి వచ్చి సీనియర్లు పార్టీకి చేసిన సేవలను గుర్తించాలని కోరారు. గొడవ చేయడం సరికాదని, అభిప్రాయాలను ఆత్రం సుగుణకు అందించాలని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆత్రం సుగుణ రాత్రి వరకు అభిప్రాయాలను స్వీకరించారు.



కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట



ఆత్రం సుగుణతో వాగ్వాదానికి దిగిన వెలిచాల రాజేందర్‌రావు



రవాణా శాఖ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

రెండో రోజూ మొరాయించిన సర్వర్లు

- మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమైన రవాణా శాఖ సేవలు
- ఇబ్బంది పడిన వాహనదారులు

తిమ్మాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ సర్వర్ గురువారం కూడా మొరా యించింది. సర్వర్ డౌన్ కారణంగా బుధవారం పూర్తి స్థాయిలో రవాణా శాఖలో సేవలు నిలిచిపోయాయి. స్లాట్ బుక్ చేసుకొని జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి వచ్చిన వాహన దారులను మధ్యాహ్నం 1.30 వరకు వేచి చూసి వెళ్లిపోయారు. గురువారం స్లాట్ బుక్ చేసుకున్న వారితోపాటు బుధవారం తిరిగి వెళ్లిపోయిన వారు ఉదయాన్నే జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి చేరుకొని క్యూలో నిలుచున్నారు. ఆర్టీఏ కార్యాలయ సిబ్బంది వచ్చి పనులు ప్రారంభించారు. నూతనంగా కొనుగోలు చేసిన ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఇతర సేవలు యథావిధిగా కొనసాగాయి. నూతనంగా కొనుగోలు చేసిన నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల (ద్విచక్ర వాహనాలు, కార్లు.) రిజి స్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదు. సంబంధిత వాహనదారుడి పేరు పై వేరే ఏదైనా వాహనం ఉందా అనే వివరాలు రాలేదు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు కార్యాలయం ఆవరణలో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్టీఏ కార్యాలయం వద్ద సదుపాయాలు లేక వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయం అధికారుల దృష్టికి పోవడంతో నిరీక్షిస్తున్న వారికి నీళ్లు, బిస్కెట్ ప్యాకెట్లను అందించారు. సాయంత్రం మూడు గంటల తరువాత సమస్య పరిష్కారం కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రిజిస్ట్రేష న్లను సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు.



పాపతో మెట్లపై కూర్చొని నిరీక్షిస్తున్న వాహనదారుడు

బీసీలను మోసం చేస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి విమర్శించారు. గురువారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి, గవర్నర్‌కు పంపితే ఆరు నెలలు గడిచినా ఆమోదించలేదన్నారు. దీంతో స్థానిక ఎన్నికల్లో బీసీ లకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రిజర్వేషన్లపై హైకోర్టులో స్టే రావడం, సుప్రీం కోర్టులో నిరాశ ఎదురు కావడం బలహీన వర్గాలను నిరాశకు గురి చేసిందన్నారు. బీసీ వర్గాలు బీజేపీని గ్రామ గ్రామాన అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సీసీఐ ద్వారా మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, బీమా సాహెబ్, సుంకరి సంపత్, రమేష్, శీలం అశోక్, డి నరేష్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్య

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు బలవన్మరణం చెందారు. వీరిలో నలుగురు ఉరి వేసుకోగా ఒకరు పురుగుల మందు తాగారు. వివరాల్లోకి వెళితే..

ఉరి వేసుకుని..



రాజేశం(ఫైల్)

కమాన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గుర్రాల రాజేశం(60) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేశం కొంతకాలంగా ఒంటరిగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి ఎస్ఐ కొట్టేప్రసాద్, ఏఎస్ఐ ఖలీల్‌ఖాన్, సిబ్బంది రమీజ్ పరిశీలించారు. మృతుడి సోదరుడు గుర్రాల చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



శివకుమార్(ఫైల్)

వెల్గటూర్: వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన తనుగుల శివకుమార్ (33) అనేయువకుడు గురువారం ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపినవివరాల ప్రకారం శివకుమార్ నాలుగు సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం వెళ్లాడు. సంవత్సరం తర్వాత అనారోగ్య కారణంగా మతిస్థిమితం కోల్పోయాడు. అక్కడి వారి సహాయంతో సొంత గ్రామానికి తిరిగి వచ్చాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని మందులు వాడుతున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. దీనితో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి తనుగుల వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జ్యోతినగర్: స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన కానుల రాకేష్(31) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగు రోజులక్రితం ఆత్మ హత్య చేసుకున్న రాకేష్ మృతదేహాన్ని గురువారం కనుగొన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న రాకేష్ ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నాడు. ఏడాది క్రితం అతని తండ్రి, 15రోజుల క్రితం రాకేష్ తల్లి చనిపోయింది. నాలుగు రోజుల క్రితమే తండ్రి సంవత్సరీకం, తల్లి దశదిన కర్మ నిర్వహించాడు. రాకేష్‌కు అక్క, బావ ఉన్నారు. దశదిన కర్మ జరిగిన రోజున బావతో రాకేష్ గొడవ పెట్టుకు న్నాడు. దీంతో అక్క, బావలు ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు దూరమైన బాధలో ఉన్న సమయంలో అక్కాబావలు కూడా దూరం కావడంతో రాకేష్ మనస్తాపానికి గురైనట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో అదేరోజు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమా చారం ఇచ్చారు. పోలీసులు తలుపు తెరవడతో రాకేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడైంది. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాధురి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన మాధురి(22) అనేవివాహిత బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గురువారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎక్కల్ దేవి రవి 2024ఆగస్టు 24న మాధురిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజుల నుంచి అత్తింటి వేధింపులతో మాధురి బాధ పడుతుండేదని, భర్త ఎక్కల్‌దేవి రవి, అత్త ఎక్కల్‌దేవి సత్తమ్మ, మామ రాజం, ఆడబిడ్డ రవళి వేధింపులతో మాధురి ఆత్మహత్య చేసు కుందని తల్లి ఎర్ర లావణ్య పోలీసులకు ఫిర్యా దు చేసింది. తహసీల్దార్ నీత సమక్షంలో పంచనామా చేసి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. భర్త, అత్తమామను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైఎస్సై-2 రాజునాయక్ తెలిపారు.

పురుగుల మందు తాగి..

రుద్రంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పిట్టల నర్సయ్య (62)అనేవ్యక్తి బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులుతెలిపిన వివరాల ప్రకారం పిట్టల నర్సయ్య అప్పుల బాధతో మనస్తాపానికి గురై బుధవారం పొలంవద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు జీవం

రూ.4.10 లక్షలతో మౌలిక వసతుల కల్పన

ఆదర్శంగా నిలుస్తున్న చింతకుంట గ్రామస్థులు

దాతల సహకారంతో ముగ్గురు విద్యా వలంటీర్ల నియామకం



రంగులతో అందంగా కనిపిస్తున్న చింతకుంట పాఠశాల

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం చింతకుంట ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు గ్రామస్థులు జీవం పోశారు. అరకొర వసతులు, విద్యార్థులు లేక బోసిపోతున్న పాఠశాలల రూపు రేఖలు గ్రామస్థుల సహకారంతో ఒక్కసారిగా మారిపోయాయి. యువత, గల్ఫ్ వలస జీవులు, మహిళలు, కుల సంఘాలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీలకు అతీతంగా నేతలు ఒక్కటై రూ.4.10 లక్షలు పోగు చేసి విద్యార్థుల సంఖ్యను అనూహ్యంగా పెంచి పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఆ మారుమూల పల్లెలో సర్కారు బడి సౌకర్యాలు సమ కూర్చుకొని విద్యార్థులతో సందడిగా కనిపిస్తోంది.

ప్రైమరీ, హైస్కూల్‌లో పెరిగిన విద్యార్థులు

ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది కేవలం 50 మంది మాత్రమే చదువుతుండేవారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 131 మందికి చేరింది. ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 53 మంది ఉండగా ప్రస్తుతం 101 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత వేసవి సెలవుల్లో గ్రామస్థులంతా కలిసి తమ పిల్లలను ప్రైవేట్ బడికి పంపవద్దని నిర్ణయించుకున్నారు. మూతపడే పరిస్థితికి చేరిన పాఠశాలను బతికించుకునేందుకు ఎన్ఆర్ఐ, యువజన సంఘాలు, మహిళలు, ప్రజాప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి విరాళాల సేకరణకు పూనుకున్నారు. రూ.4.10 లక్షలు పోగు చేసి పాఠశాలకు గేట్లు ఏర్పాటు చేశారు. చిన్నారులను విద్య పట్ల ఆకర్షితులను చేయా లనే తలంపుతో పాఠశాల గోడలపై ఆకర్షణీయమైన రంగులతో బొమ్మలు వేయించారు. సైన్స్, సోషల్‌కు సంబంధించి పటాలను ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ప్రహరీ లేకపోవడం వల్ల చుట్టూ రంగుల నెట్‌ను రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్నారు.

2009-10 పదో తరగతి పూర్వ విద్యార్థులు హైస్కూల్‌లో ఫిల్టర్ వాటర్‌ప్లాంట్, 2011-12 బ్యాచ్ విద్యార్థులు వాటర్ ట్యాంక్, ఎలక్ట్రికల్ బెల్ ఏర్పాటు చేయించారు. పాఠశాలల్లో సీసీ కెమెరా లు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. విద్యా ర్థుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశా లలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీంతో ఇద్దరు దాతల సహకారంతో ముగ్గురు విద్యా వలంటీర్లను నియమించారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ప్రీ ప్రైమరీలోనూ 20 మంది ప్రవేశాలు పొందారు.

అదనపు తరగతి గదులు అవసరం..
సుధాకర్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం



ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య ఊహించని విధంగా పెరగడానికి గ్రామస్థులు చేసిన కృషి ఎంతో ఉంది. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుంది. ప్రస్తుతం ఉన్న ఐదు గదు లు సరిపోవడం లేదు. ప్రీప్రైమరీ కూడా కొనసాగిస్తున్నందు వల్ల అదనంగా తరగతి గదులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మరుగుదొడ్డి, గదుల మరమ్మతులు కొనసాగుతున్నాయి.

బోరు ఏర్పాటు చేయాలి..
: రవి, హైస్కూల్ హెచ్ఎం



రెండు పాఠశాలలు ఒకే ఆవరణలో ఉండగా తాగునీటికి బోరు లేదు. గ్రామస్థులను ఒప్పించి పక్కనే ఉన్న బోరును వినియోగించుకుంటున్నాం. నీరు సరిపోవడం లేదు. ప్రహరీ నిర్మాణం చేయాల్సి ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఇదే ఆవరణలో కొనసాగుతున్నాయి. మౌలిక వసతులు ఉంటేనే విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపుతారు.





ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు, పాఠశాల చుట్టూ రక్షణ కోసం చేసిన ఏర్పాట్లు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) ఇల్లందకుంట మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. జమ్మికుంట మానేరు పరివాహ ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ఇసుక ట్రాక్టర్లు సిరిసేడు వస్తుండగా, ఆపి తనిఖీచేశారు. సంబంధిత పత్రాలు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామ శివారులో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్దపాక గ్రామానికి చెందిన జక్కుల దేవేందర్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకరవాణా చేస్తుండగా గ్రామశివారులో పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మల్లారెడ్డిపేటకు చెందిన చందు, నందం అనే వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నారని ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ వెల్లడించారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

ఓదెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో గురువారం పొత్కపల్లి పోలీసులు పేకాటకేంద్రంపై దాడి చేశారు. గ్రామశివారులో కొందరు పేకాట ఆడుతుండగా ఐదుగురిని అదుపులోకితీసుకొని వారినుంచి రూ.3,500 స్వాధీనం చేసుకున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ, గ్రామాల్లో యువకులు, జూదం, ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు.

రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ పోటీలు ప్రారంభం

● బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో పోటీలు ● పోటీలను ప్రారంభించిన జోనల్ సీఈ విజయ్‌కుమార్



ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో బాస్కెట్‌బాల్‌లో తలపడుతున్న నల్గొండ, కరీంనగర్ జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ సర్కిల్‌ల బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్ పోటీలు జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్‌సర్కిల్ బాస్కెట్‌బాల్ కోర్టులో గురువారం ప్రారంభమయ్యాయి. కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఓఎంసీ సర్కిల్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని 10సర్కిళ్ల టేబుల్ టెన్నిస్ జట్లు, ఏడు సర్కిళ్ల బాస్కెట్‌బాల్ జట్లు పాల్గొంటున్నాయి. పోటీలను కరీంనగర్ జోనల్‌సీఈ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ సర్కిల్ క్రీడలకు పెట్టింది పేరన్నారు. పలు క్రీడాంశాల్లో ప్రతిభచాటి విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్‌ను కరీంనగర్ సర్కిల్ సాధిస్తుండడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్ ఎల్లవేళలా క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహిస్తాయన్నారు. ఈనెల 18వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్ఈ ఎస్ శ్రీనివాస్, ఎస్ఈ ఆపరేషన్ ఎం రమేష్ బాబు, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎన్ జగన్నాథ్, కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు పి రఘునందన్, ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మొదటి రోజు బాస్కెట్‌బాల్ పోటీల ఫలితాలు...

మొదటిమ్యాచ్‌లో కరీంనగర్ ఆపరేషన్‌జట్టు నల్గొండ ఆపరేషన్ జట్టుతో తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఓఎంసీ కరీంనగర్‌జట్టు నిజామాబాద్ ఆపరేషన్ జట్టుతో తలపడగా నిజామాబాద్ ఆపరేషన్ జట్టు విజయం సాధించింది. మూడోమ్యాచ్‌లో నల్గొండ ఆపరేషన్ జట్టు నిజామాబాద్ ఓఎంసీ జట్టుతో తలపడగా నల్గొండ జట్టు విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో కరీంనగర్ ఓఎంసీ జట్టు ఖమ్మం ఆపరేషన్ జట్టుతో తలపడగా ఖమ్మం ఆపరేషన్ జట్టు విజయం సాధించింది.

బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు, ఒకరి అరెస్ట్

వేములవాడ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడుతున్న వేములవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్‌చేసినట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు. వేములవాడ టౌన్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణం అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మెల మహిపాల్ అనేవ్యక్తి వృత్తిపరంగా ఒగ్గు కళాకారుడు. గంగాదేవిని పూజిస్తూ నవుడాలమ్మ పూజలు చేస్తూ మూలికల వైద్యం ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. ఈనెల 11న వేములవాడకు చెందిన ఓవ్యక్తి జర్నలిస్ట్ ముసుగులో మహిపాల్‌కు ఫోన్‌చేసి నీవు వేములవాడకు రావాలని రాకపోతే నీపై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. మహిపాల్ వేములవాడకు వచ్చి ఆ వ్యక్తిని కలుసుకోగా ఏ విషయమై నాపై ఫిర్యాదు చేస్తావని అడిగితే పొంతనలేని సమాధానాలు చెప్పడమే కాకుండా నీ గురించి పేపర్‌లో రాస్తానని బెదిరించాడు. మరుసటి రోజు మళ్లీ అవ్యక్తి ఫోన్‌చేసి నీవు ఒకరిని మోసం చేశావని బాధితులు పేపర్‌లో రాయమని ఒత్తిడిచేస్తున్నారని రాయకుండా ఉండాలంటే మరోవ్యక్తి అయిన రాజుకి రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. భయభ్రాంతులకు గురైన మహిపాల్ ఈనెల14న ఫోన్‌పే ద్వారా రూ.10 వేలు చెల్లించాడు. అయినప్పటికీ మిగితా రూ.20వేలు ఇవ్వాలని బెదిరించాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి కరుణాకర్ అనే వ్యక్తి రిమాండ్‌కు తరలించామని, రాజు పరారీలో ఉన్నాడని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన మట్టి ట్రాక్టర్లు

చందుర్తి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకున్నట్లు చందుర్తి ఎస్ఐ రమేష్ గురువారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం గురువారం మర్రిగడ్డ నుంచి దేవునితండా ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జోగాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను, డ్రైవర్లు అజుగుల దేవరాజ్, రత్నం సంజీవ్ అదుపులోకి తీసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ జె. రమేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో కొనుగోలు చేసిన ద్విచక్రవాహనంపై సంతోషంగా ఇంటికి వస్తున్న ఓవ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్‌తెలిపిన వివరాల మేరకు.. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన ఆడేపు కుమార్ (54) కరీంనగర్‌లో సెకండ్ హ్యాండ్‌బైక్ కొనుగోలు చేశాడు. అదే బైకుపై ఇంటికి వస్తున్నాడు.

మరో ఐదునిమిషాల్లో ఇంటికి చేరుతాడనగా, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి-సుల్తాన్‌పూర్ గ్రామాలమధ్య సైకిల్‌ను ఢీకొని కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో ఆడేపు కుమార్ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాద వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసు పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరలు

వేములవాడ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులు పండించిన ధాన్యం కనీసం మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈసందర్భంగా 2025-26 సంవత్సరానికి మార్కెట్‌కమిటీ కార్యదర్శి సత్యనారాయణ ధరల పట్టికలో మద్దతు ధరలను గురువారం పొందుపరిచారు. రైతులు పండించిన వివిధరకాల ధాన్యాలకు ప్రభుత్వం ప్రకటించిన ఒక్కక్వింటాలు ధరలు ఇలా ఉన్నాయి. ధాన్యం సాధారణరకం రూ.2,369, ధాన్యం గ్రేడ్ ఏరకం రూ.2,389, జొన్నలు హైబ్రీడ్ రకం రూ. 3,699, జొన్నలు మాల్దండి రకం రూ.3,749, సజ్జలు రూ. 2,775, రాగులు రూ.4,886, మొక్కజొన్న రూ. 2,400,కందులురూ.8వేలు, పెసర్లురూ.8,768, మినుములు రూ.7,800,వేరుశనగకాయలు రూ.7,263, పొద్దుతిరుగుడు రూ.7,721, సోయా చిక్కుడు రూ.5,328, నువ్వులు రూ.9,846, వలసలు (గడ్డినువ్వులు) రూ.9,537, పత్తి మధ్యరకం పింజ రూ.7,710, పత్తిపొడుగు రకంపింజరూ.8,110క్వింటాళకు ధరలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బస్సులు

శంకరపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ ఎదుట గురువారం రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్, సిరిసిల్ల డిపోలకు చెందిన బస్సులు బస్టాండ్ ఎదుట ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో బస్సుల్లోని కొంత మంది ప్రయాణీకులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సుల ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నాయి.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● నాలుగు తులాల బంగారం, నగదు అపహరణ



బీరువా తాళలు పగలగొట్టి బట్టలను చెల్లా చెదురు చేసిన దొంగలు

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని హన్‌మాన్‌నగర్‌లో బుధవారం రాత్రి దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి 4తులాల బంగారం, 50వేల నగదును ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్‌మాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న మానస అనే గృహిణి బుధవారం రాత్రి తన ఇంటికి తాళం వేసి తల్లిగారి ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 4తులాల బంగారం, నగదు మాయమైనట్లు గుర్తించింది. బాధితురాలు పోలీసులకు సమాచారం అందివడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాస్‌పై హత్యాయత్నం కేసులో ఇదే గ్రామానికి చెందిన నక్క రవిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్పై వివరాల ప్రకారం శ్రీనివాస్‌కు, రవిల మధ్య కొంతకాలంగా డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇరువురి మధ్య పంచాయతీలు కూడా జరిగాయి. డబ్బుల విషయంలో విసిగిపోయిన రవి గురువారం శ్రీనివాస్‌ను చంపివేయాలనే ఉద్దేశ్యంతో కూరగాయలు కోసే కత్తితో దాడిచేశాడు. దాడిలో శ్రీనివాస్‌కు చేతికి, గదవపై గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తదుపరి విచారణ చేపట్టిన సిరిసిల్ల సీఐ మొగిలి నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పై తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

ధర్మపురి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో గంజాయి సరఫరా చేస్తున్న చొప్పరి పృథ్వీరాజు అనేవ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ గురువారం తెలిపారు. ధర్మపురి పట్టణానికి చెందిన పృథ్వీరాజు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అతనిని సోదా చేయగా 103గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. గంజాయి స్వాధీనంచేసుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

గర్రెపల్లిలో యువకుల వీరంగం

● చికెన్ సెంటర్ నిర్వాహకులపై కత్తులతో దాడి ● ముగ్గురికి గాయాలు



షాపులో నుంచి కత్తి తీస్తున్న యువకుడు

సుల్తానాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి బస్టాండ్ సమీపంలో మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. రోడ్డు పక్కనున్న చికెన్ సెంటర్ నిర్వాహకులపై యువకులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయగా, ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గురువారం రాత్రి గర్రెపల్లి బస్టాండ్ సమీపంలోని చికెన్‌సెంటర్ వద్దకు కారులో ముగ్గురు వ్యక్తులు బీర్లు తాగుతూ సీసాలు చేతిలో పట్టుకుని వచ్చారు. చికెన్ కావాలని నిర్వాహకులతో గొడవపడ్డారు. ఒక్కసారిగా యువకులు చికెన్ సెంటర్ నిర్వాహకులను చికెన్ కొట్టడానికి ఉపయోగించే కత్తిని తీసుకొని దాడిచేయగా, నిర్వాహకులు, రసీద్‌కు గాయాలయ్యాయి. గొడవను ఆపే ప్రయత్నంలో పక్కనున్న మరో దుకాణం యజమానిని కూడా కొట్టారు. అనంతరం ముగ్గురు యువకులు అదే కారులో పరారయ్యారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. పారిపోయిన వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ముగ్గురు యువకులు చికెన్ సెంటర్ నిర్వాహ కులపై దాడి చేశారని, వారి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.6700 పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లు పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

జమ్మికుంట రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6700 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 170మంది రైతులు 1292క్వింటాళ్ల విడి పత్తి, 30మంది రైతులు 44క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.6700, కనిష్ఠ ధర రూ.5300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించారు. శని, ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కాగా, దీపావళి పండుగ సందర్భంగా సోమ, మంగళవారం యార్డుకు సెలవు దినాలు ప్రకటించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



చింటూ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న జాతీయరహదా రిపై గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇసుక ట్రాక్టర్‌ను నడుపుతున్న ఓయువకుడు అక్కడి కక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాపూర్ గ్రామానికిచెందిన చింటూ(22)ఇసుక ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. విలాసాగర్ నుంచి పెద్ద పాపయ్యపల్లెకు ఇసుకను అన్‌లోడ్ చేసిన అనంతరం తిరిగి తనస్వగ్రామానికి రంగాపూర్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో రాంపూర్ శివారులో నిర్మాణంలో ఉన్న జాతీయరహదారిపై ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడపటం మూలంగా అదుపుతప్పి ట్రాక్టర్ ఒక్కసారిగా రహదారిమీద నుంచి పక్కనేఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడిన డ్రైవర్ చింటూ తీవ్రగాయాలై ఘటనస్థలంలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్నపోలీసులు ఘటనస్థలానికి చేరుకున్నారు. ట్రాక్టర్‌కింద ఇరుక్కుపోయిన చింటూ మృతదేహాన్నిపోలీసులు స్థానికుల సహాయంతో బయటకు తీశారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతు న్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మంథని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొడుగు బిల్డింగ్ ఏరియా సమీపంలోని ఓ ఇంట్లో పట్టణానికి చెందిన బండారి శ్రీనివాస్ అనే యువకుడు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. శ్రీరామకాలనీ సమీపంలో కొనుగోలు చేసిన భూమిని యజమాని మరో వ్యక్తికి సైతం విక్రయించడంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ తనకు భూమి అమ్మినవ్యక్తి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. దీంతో అక్కడే ఉన్న వారు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనం తరం మెరుగైన చికిత్సకోసం గోదావరిఖనికి తరలించగా చికిత్స పొందు తున్నాడు. ఈమేరకు పోలీసులు విచారిస్తున్నారు.

శ్రీరాంసాగర్ వరద గేట్ల మూసివేత

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను గురువారం మూసివేశారు. ఎగువ ప్రాంతం నుంచి 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 5,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు వదిలారు.

బంతి పూల సాగుతో భరోసా

● కిలో రూ. వంద వరకు పలికిన ధర ● రైతుల వద్ద కొనుగోలు చేసిన ప్రజలు





చొప్పదండి మండలంలో సాగవుతున్న బంతి పూల తోట, మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌లో పూలు తెంపుతున్న మహిళా రైతు

చొప్పదండి/మానకొండూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలు బంతి పూల సాగు చేసిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించింది. ఆటు దిగుబడితో పాటు ఈసారి మంచి ధర పలకడంతో బంతిపూల రైతులకు కాలం కలిసి వచ్చింది. పంటకు పెట్టుబడి బాగా పెరిగినప్పటికీ, చాలా మంది రైతులు రోడ్లపై రిటైల్‌గా బంతి పూలను కిలో వంద రూపాయలకు అమ్ముకున్నారు. పూలు కావలసిన ప్రజలు కూడా బంతి పూల తోటల వద్దకు వెళ్లి కొనుగోలు చేశారు. ఎకరంలో 15



నుంచి 20 క్వింటాళ్ల వరకు బంతి పూల దిగుబడి రావడంతో రెండు లక్షల వరకు పలువురు రైతులకు ఆదాయం లభించింది. బతుకమ్మ, దసరా పండుగలకు బంతి పూలకు ఈ సారి మంచి డిమాండ్ ఏర్పడడంతో పాటు మంచి ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా మరో మూడు రోజుల్లో దీపావళి పండుగ రానుండగా బంతి పూలకు డిమాండ్ బాగా ఉండడంతో రైతులు తమ పంటకు అదే ధర పలుకుతుం దనే ఆశతో ఉన్నారు. గతంలో బంతి పూలను 10, 20 రూపాయలకు కిలో అమ్మి నష్టపోయిన సందర్భాలు ఉండగా ఈ సారి మాత్రం కిలో పూలకు వంద రూపాయలు పలకడం రైతులను గట్టెక్కించింది. మండలంలో దాదాపు 200 ఎకరాల్లో బంతి పూల సాగును రైతులు చేపట్టారు.

● లక్ష్మీపూర్‌లో...

మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పెద్ది కావ్యశ్రీనివాస్ అనే రైతు దంపతులు 20 గుంటల భూమిని కౌలుకు తీసుకొని బంతిపూల సాగు చేశారు. పువ్వులు పూరిత స్థాయిలో కోతకు రాకపోవడంతో ఇటీవల దసరా పండుగకు అమ్మకాలు తక్కువగా జరిగాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో కోత దశకు వచ్చింది. దీంతో రెండు రోజుల్లో పువ్వులను కోసి మార్కెట్‌కు తరలిస్తామని రైతు దంపతులు తెలిపారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ముద్దసాని రమేష్‌రెడ్డి

తిమ్మాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 14న ప్రారంభమైన ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లాస్థాయి అండర్19 వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి బాలబాలికల విభాగంలో 85జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో మంచి ప్రతిభకనబరిచిన శ్రీ చైతన్య డిఫెన్స్‌అండ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు మొదటిస్థానంలో నిలిచారు. ఈ ముగింపు కార్యక్ర మానికి విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాల్లో గెలుపు, ఓటములు సహజమని ఓడిన వారు నిరాశ పడకుండా, గెలుపు కోసం ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గన్నేరువరం ఎస్‌ఐ రంజిత్‌కుమార్, ఎస్‌జీఎఫ్‌ఐ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్, డిఫెన్స్ అకాడమి ప్రిన్సిపాల్ పల్లె శ్యాం సుందర్‌రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, పిడిలెంకల మహిపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సి పాల్ శ్రీనివాస్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వ్యక్తిపై దాడి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మూత్రవిసర్జన చేసిన వ్యక్తిపై బుధవారం రాత్రి నలుగురు విచక్షణరహితంగా దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. తనను పోలీసులే కొట్టారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. కరీంనగర్‌కు చెందిన పరశురాం కూలీ పనిచేసుకుంటూ రోడ్లపైన జీవనం సాగిస్తున్నాడు. తాగినమత్తులో బస్టాండ్ ఆవరణలో మూత్ర విసర్జన చేయడంతో పలువురు కొట్టారు. దాడిలో చెయ్యి విరిగింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు రావడంతో చికిత్స నిమిత్తం పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు చెయ్యి విరిగిందని సర్జరీ అవసరమని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కొట్టారని బాధితుడు తెలపడంతో వన్‌టౌన్ పోలీసులు బస్టాండ్ ఆవరణలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

మత్స్యకారులకు అండగా నిలవాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు అండగా నిలువాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్థకశాఖ మంత్రి వాకటి శ్రీహరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌లో గురువారం జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘ చైర్మన్ చొప్పరి రామచంద్రం ఆధ్వర్యంలో కలిసి సమస్యలను వివరించారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో మత్స్యకారులకు సొసైటీ భవనాలు నిర్మించాలని, 55 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘ మాజీ అధ్యక్షుడు కంకటి ప్రభాకర్, నాయకులు కూనబోయిన పర్శరాం, శ్రీకాంత్, నర్సయ్య తదితరులు ఉన్నారు.



మంత్రి శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం కేటాయించాలి



రగుడు బైపాస్ రహదారికి ఓ వైపు ఫ్లెక్సీ కట్టిన రైతులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం కేటాయించాలని రైతులు రోడ్డును ఆక్రమించుకుని ఆందోళన చేపట్టారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనువైన స్థలాలు లేకపోవడం వల్ల ప్రధాన రహదారిపై ధాన్యం కుప్పలు పోయాల్సి వస్తోందని, వాహనదారులు మరోదారి నుంచి వెళ్లాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, సిరిసిల్ల విలీన గ్రామాల రైతులు వెంకటాపూర్ గ్రామ శివారులోని వెంకటాపూర్- రగుడు బైపాస్ రహదారికి ఓ వైపు గురువారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రహదారిపై టైర్లు వేసి అడ్డుగా కట్టారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ప్రధాన రహదారిని మూసి వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్లెక్సీని తొలగించేందుకు యత్నించారు. దాంతో రైతులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ధాన్యం కుప్పలు పోసుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు.అనంతరం రోడ్డుకు అడ్డుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పోలీసులు తొలగించారు. కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఈ నెల 17న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు రైతులు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమం లో వెంకటాపూర్, సిరిసిల్ల విలీన గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం కొండంత..!

● దేవస్థానం పరిధిలో ఒక్కరే విద్యుత్ సిబ్బంది
● పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు సిబ్బంది కరువు
● పట్టించుకోని దేవాదాయశాఖ.. భక్తులకు శాపం

మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో స్వామి వారి దర్శనానికి వచ్చిన గోదావరిఖనికి చెందిన రాజేశ్వరి అనే భక్తురాలు గురువారం విద్యుదాఘాతంలో మృతిచెందడం దేవస్థానం అధికారుల నిర్లక్ష్యమేననే సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యంవేలాది మంది, ఉత్సవాల సమయంలో లక్షలాదిగా భక్తులతో రద్దీగా ఉండే ఇక్కడ విద్యుత్‌కు సంబంధించి విధులు నిర్వహించే సిబ్బంది ఒక్కరేఉండడం చర్చనీ యాంశంగా మారింది. దేవస్థానం పరిధిలో 60కమర్షియల్, నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు ఉండడం, దిగువకొండగట్టు, ఇతరప్రాంతాల్లోను కనెక్షలు వినియోగంలో ఉన్నాయి. వీటిని ఒక్కరు మాత్రమే పర్యవేక్షణ చేయడంప్రమాదాలకు కారణంగా పేర్కొంటున్నారు. దీనికితోడు రెండేళ్లుగా ఇంజనీరింగ్ అధికారులు లేకపోవడంతో పనుల పర్యవేక్షణ బాధ్యతలను కూడా ఎలక్ట్రీషియన్‌కే అప్పగించినట్లు తెలుస్తోంది.



● విద్యుత్ తీగలు ఊడి..

కొండపైన కల్యాణకట్టలో ప్రతిఏటా జరిగే జయంత్యుత్సవాల సందర్భంగా దీక్షాపరులు మాలవిరమణ చేస్తుంటారు. దీంతో అక్కడేగల మూత్రశాల వద్ద ట్యూబ్ లైట్ అమర్చారు. ఇటీవల కోతులు ట్యూబ్‌లైట్ తీగలు తెంచడంతో అవి అలాగే వేలాడుతున్నాయి. తరచూ కళ్యాణకట్టలోఇతర వాటి కోసం విద్యుత్ సరఫరా చేస్తుండగా తెగిన తీగల దానికి కూడా కరెంటు సరఫరా అవుతోంది. దీంతో బుధవారమే ఈ తీగలతో ఓ వానరం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. అప్పుడే తగుచర్యలు తీసుకుంటే గురువారం ప్రమాదం జరిగి ఉండేదికాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

● కొండపై లూజు తీగలే అధికం

కొండపైన విద్యుత్‌సిబ్బంది కొరతతో లూజు తీగలే అధికంగా దర్శనమిస్తుంటాయి. కోతులతో అవి కూడా వేలాడుతున్నాయి. తరచూ తీగలు తెగిప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ సిబ్బందిని నియమించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

● కొండగట్టు కల్యాణకట్ట దగ్గర ఘటన
● రక్షించబోయిన కోడలుకూ విద్యుదాఘాతం



రాజేశ్వరి(ఫైల్)

మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామి దర్శనానికి వచ్చిన రాజేశ్వరి అనే (84) వృద్ధురాలు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పెద్దపల్లిజిల్లా గోదావరిఖనికి చెందిన సత్యనారాయణ తన తల్లి, భార్యతో గురువారం వేకువజామున కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చారు. రాజేశ్వరి కాలకృత్యాలు తీర్చుకునేందుకు కల్యాణకట్టవద్ద గల మరుగుదొడ్లవద్దకు వెళ్లింది. క్రమంలో వృద్ధురాలు అక్కడున్న బారికేడ్‌ను ముట్టకోగా దానిపై తెగిపడిన విద్యుత్ తీగలు తాకి విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే రక్షించేందుకు రాజేశ్వరి కోడలు యత్నించగా ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబసభ్యులు స్థానికులసహాయంతో కల్యాణకట్టలో విద్యుత్‌సరఫరాను నిలిపివేశారు. అనంతరం వృద్ధురాలిని చికిత్స కోసం జగిత్యాలకుతరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది. ప్రమాదానికి ముందు మరుగుదొడ్లకు వెళ్లే మార్గాన్ని బారికేడ్‌తో మూసివేసినప్పటికీ కొండపైన తలనీలాల సేకరణ కాంట్రాక్టర్‌వద్ద పనిచేసే సురేశ్‌బాబు అనే వ్యక్తి తొలగించాడని సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా పోలీసులు గుర్తించారు.

● దేవస్థానం ఈవోతో పాటు పలువురిపై కేసు

విద్యుదాఘాతంలో తమ తల్లి రాజేశ్వరి మృతికి దేవస్థానం ఈవో, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుమారుడు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈవోతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మెట్‌పల్లి విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన మెట్‌పల్లి విద్యార్థుల ప్రాజెక్టు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యస్తరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జగిత్యాల జిల్లాకు చెందిన జడ్పీహెచ్‌ఎస్ (బాలికలు)- మెట్‌పల్లి విద్యార్థులు వర్షిత, వాగ్దేవిలు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 18 నుంచి 23వరకు బోపాల్‌లో జరిగే జాతీయస్థాయి రాజ్యస్తరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరవుతారని పాఠశాల హెచ్‌ఎం కనకతార, గైడ్ టీచర్ సతీష్ కుమార్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో రాము, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్‌లు శుభాకాంక్షలు తెలిపారన్నారు. ఈ ప్రదర్శనలో బహుళ ప్రయోజన పంటల సంరక్షణ పరికరం రైతుల పంటల సంరక్షణలో ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారం అందిస్తుందని వారు తెలిపారు.

అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు మోగిన నగారా



● ఎన్నికల అధికారిగా డీసీవో మనోజ్‌కుమార్
● 12 డైరెక్టర్ పోస్టుల్లో ఒకటి ఎస్సీ, ఎస్టీ, రెండు మహిళలకు రిజర్వు
● 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
● 24న పరిశీలన... 25న తుది జాబితా విడుదల
● 1న పోలింగ్.. అదే రోజు ఫలితాల వెల్లడి



కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ అడిషనల్ రిజిస్ట్రార్ జి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఎన్నికల అధికారిగా జగిత్యాల జిల్లా సహకారశాఖ అధికారి సీహెచ్ మనోజ్‌కుమార్‌ను నియమించారు. నవంబరు 1న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. 2017 ఏప్రిల్‌లో పాలకవర్గ పదవీ కాలం ముగియగా ఎనిమిదేళ్ళుగా ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమిస్తూ వచ్చింది.

ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి కమిటీ పదవీకాలం మూడు రోజుల క్రితం ముగిసింది. ఈసారి కూడా ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జి కమిటీకి ఎక్స్‌టెన్షన్ ఇవ్వడమా... కొత్త కమిటీని వేయడమో జరుగుతుందనే ప్రచారం జరిగింది. దీంతో అర్బన్ బ్యాంకు సభ్యులతో పాటు పాలకవర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెల కొంది. అర్బన్ బ్యాం కు పాలకవర్గం, అధి కారులపై వేసిన నాలుగు కేసులను పరిశీలించిన న్యాయ స్థానం గత మంగళవారం అన్నింటిని కొట్టి వేయడంతో ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఎనిమిదేళ్ల తర్వాత ఎట్టకేలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ఉత్కంఠకు తెరపడటమే కాకుండా సభ్యులతోపాటు బ్యాంకు వర్గాల్లో కూడా హర్షం వ్యక్తమవుతోంది.

12 మంది డైరెక్టర్ల ఎన్నికకు బ్యాలెట్ ద్వారా పోలింగ్:

ప్రస్తుత నోటిఫికేషన్‌లో 12 మంది డైరెక్టర్లకు బ్యాలెట్ ద్వారా సీక్రెట్ ఓటింగ్ నిర్వహించాలని సూచించింది. 12 మంది డైరెక్టర్ స్థానాల్లో ఒక స్థానాన్ని ఎస్సీ లేదా ఎస్టీకి, రెండు డైరెక్టర్ స్థానాలను మహిళలకు, 9 డైరెక్టర్ పదవులను ఓపెన్ కేటగిరీకి రిజర్వు చేశారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 24న నామినేషన్లను పరిశీలించి 25న తుది జాబితాను విడుదల చేస్తారు. నవంబరు 1న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్లను లెక్కిస్తారు.

కరీంనగర్, జగిత్యాల, గంగాధర అర్బన్ బ్యాంకుశాఖల్లో మొత్తం 9,300 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. 12 డైరెక్టర్ స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన మొదటి 12 మంది సభ్యులను ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. డైరెక్టర్ల ఎన్నిక అనంతరం ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా డైరెక్టర్లు ఎన్నుకుంటారు. అధికారుల నుంచి ఒకరిని, రిటైర్డు ఉద్యోగుల నుంచి ఒకరిని కో ఆప్షన్ సభ్యులుగా సహకారశాఖ అధికారులు నియమిస్తారు.

9,300 మంది సభ్యులకు ఓటు హక్కు

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు లైట్ బ్లూ కలర్ బ్యాలెట్, మహిళా స్థానాలకు పింక్ కలర్, ఓపెన్ కేటగిరీ స్థానానికి తెల్ల రంగు బ్యాలెట్ పత్రాలను వినియోగించాలని సూచించారు.

రద్దు చేసిన సభ్యులకు తిరిగి అవకాశం

2007-17 వరకు అధికారంలోఉన్న పాలకవర్గ సభ్యులు బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా సభ్యత్వాలు ఇచ్చారని, మరికొన్ని ఆరోపణలతో కొందరి సభ్యత్వాలను రద్దు చేసింది. దీంతో వారు కోర్టును ఆశ్రయించగా సభ్యత్వాల రద్దును కొట్టివేస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. పాత పాలకవర్గ కమిటీ సభ్యుల సభ్యత్వాలు యథావిధిగా కొనసాగడంతోపాటు తిరిగి పోటీచేసే అవకాశం లభించింది. ఆర్థిక లావాదేవీలతో కూడిన బ్యాంకు పాలకవర్గం ఎన్నికలను పార్టీరహితంగా నిర్వహిస్తున్నప్పటికి అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతరపార్టీలు వారి ప్యానల్స్‌తో ఎన్నికల బరిలో నాయకులను నిలుపుతారు. ఈసారి కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ పాలకవర్గం, తాజా మాజీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు రెండు ప్యానల్స్‌గా పోటీచేసే అవకాశాలున్నాయి.

ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

కమాన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడిజిల్లాస్థాయి ఆర్చరీ పోటీలను సెంటనరీకాలనీలోని రాణిరుద్రమాదేవి క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. ఇందులో పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల,జగిత్యాలజిల్లాల నుంచి సుమారు వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14,17విభాగంలో ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ తదితర అంశాల్లో పోటీల్లో తలపడ్డారు. ఇందులో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా ఆర్చరీ ప్రధానకార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన వారంతా ఉమ్మడిజిల్లా తరపున రాష్ట్రస్థాయికి ఆడతారని శ్రీనిత్యద్వితీయ,మితాలితృతీయస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, లింగం శ్రీనివాస్, వెంకటేష్, శిరీష, సింగరేణి క్రీడాకారులు రవి, అఖిల్, సంతోష్, అభిషేక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం

భగత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపో మేనేజర్లతో రీజినల్ మేనేజర్ బి రాజు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ లక్కీ డ్రాను ప్రకటించింది. విజేతలైన కరీంనగర్‌కు చెందిన ఇ రమేష్‌కు 25 వేల రూపాయలు, గోదావరిఖనికి చెందిన సదానందంనకు 15 వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, పి మల్లేశం, రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం బి రాజు

చెకుముకి సంబురాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో నగరంలో డిసెంబరులో నిర్వహించే రాష్ట్రస్థాయి చెకుముకి సంబురాలు సైన్స్ టాలెంట్ టెస్టుకు హాజరుకావాలని కలెక్టర్ పమేలా సత్పతిని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు ఆహ్వానించారు. గురువారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి చేపడుతున్న కార్యక్రమలను వివరించి కలెక్టర్‌కు సభ్యత్వం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ రాజేశ్వర్, కార్యదర్శి రాజు, ప్రొఫెసర్ రామచంద్రయ్య, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ బీఎన్‌రెడ్డి, వరప్రసాద్, రామరాజు, సంపతి రమేశ్, జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి శంకర్, దేవేందర్ పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి స్థానం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరికి స్థానం కల్పించారు. గురువారం రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్, మన్నెగూడలో జరిగిన యూనియన్ రాష్ట్ర ఐదో మహాసభల సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. కరీంనగర్‌కు చెందిన జనగాం రాజమల్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మహిళా సబ్ కమిటీ కన్వీనర్‌గా ముక్కెర బుజ్జమ్మ ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్ నాయకులకు జూబ్లీహిల్స్ ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతలు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో యూసూఫ్‌గూడ డివిజన్‌లో ఎన్నికల ప్రచార బాధ్యతలను జిల్లాకు బీఆర్ఎస్ నాయకులకు పార్టీ అప్పగించింది. ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుకు ఉపఎన్నికల సమన్వయకర్తల ఇన్‌చార్జిలుగా నియమించారు.

క్రీడా ప్రాంగణాల నిర్వహణ కరువు

- కొనుగోలు కేంద్రాలుగా మారుతున్న మైదానాలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామంలో లక్షలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. క్రీడా ప్రాంగణాలకు నిర్వహణ కరువవడంతో ఇవి కాస్తా వరి కొనుగోలు కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రతీ యేడు దాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థలం కరువవడంతో క్రీడా మైదానంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో క్రీడాకారులకు ఆటాడుకునేందుకు వీలువడటం లేదు. మైదానాల్లో పిచ్చి మొక్కలు పెరిగి ఆటలు ఆడేందుకు ఏ మాత్రం అనువుగా లేకుండా తయారవుతున్నాయి. దీంతో క్రీడాకారులు నిరాశకు గురవుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని 14 గ్రామాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 సంవత్సరంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాల నిర్మాణాన్ని చేపట్టింది. ఉపాధిహామీ పథకంలో ఒక్కో క్రీడా



గోపాల్‌పూర్‌లోని క్రీడా ప్రాంగణంలో ఆరబెట్టిన ధాన్యం(ఫైల్)

ప్రాంగణానికి రెండు లక్షల రూపాయల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు ఖర్చు చేసింది. ఇందులోనే వ్యాయామం కోసం పరికరాలను ,ఫుట్ బాల్, వాలీబాల్ కోసం ఇనుపరాడ్లను, అలాగే కొందరు వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపంతో క్రీడాకారులకు ఉపయోగంలో లేకుండా పోతున్నాయి.

క్రీడా ప్రాంగణాల నిర్వహణ గాడి తప్పడంతో చామనపల్లి, చెర్లబూత్కూర్, జూబ్లీనగర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో క్రీడాప్రాంగణాల్లో రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు వినియోగిస్తున్నారు. ఇరు కుల్ల, చేగుర్తి, ఎలబోతారం గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు, గడ్డి మొలిచి ఆటలు ఆడలేని పరిస్థితి నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం యువతకు స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా స్పోర్ట్స్ కిట్లను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. పరికరాలు లేక నిర్వహణ లేక క్రీడాప్రాంగణాలు ఆదరణకు నోచుకోకపోవడంతో అవి కాస్తా వరి కొనుగోలు కేంద్రాలుగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు చొరవతీసుకుని క్రీడా మైదానాలు ఉపయోగకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్ఎండీ కాలనీలో గల క్యాంపు కార్యాలయంలో తిమ్మాపూర్ మండలానికి చెందిన 72 మందికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన 19లక్షల 51వేల రూపాయల విలువచేసే చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న పేదలకు ప్రభుత్వపరంగా కొంతమేరకు ఆదుకోవాలనే ఉద్దేశంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందజేస్తున్నామని తెలిపారు. నిమ్స్ ఆసుపత్రిలో లక్షల్లో ఖర్చయ్యే వైద్యచికిత్సల కోసం ఎల్వోసీ ఇప్పిస్తున్నామని అన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జాబితా నుంచి తొలగిస్తాం..

మానకొండూర్: ఇందిరమ్మ ఇల్లు మంజూరై నిర్మాణాలు చేపట్టని వారిని జాబితా నుంచి తొలగించి అర్హులైన వారికి మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నిజాయితీగూడెంలో గురువారం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంజూరైన లబ్ధిదారులందరు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. బిల్లుల మంజూరు ఎలాంటి జాప్యానికి తావులేదని ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, మాజీ సర్పంచు బోళ్ల మురళీధర్, రవీంద్రాచారి ఉన్నారు.

మంత్రిపై అనుచిత పోస్ట్.. ఫిర్యాదు

కరీంనగర్ క్రైం , అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చనిపోయారంటూ బీఆర్ఎస్ మహిళా నాయకురాలు గీతారెడ్డి తన ఐడీతో ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ పెట్టారని యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ గురువారం వన్ టౌన్‌లో సీఐకి ఫిర్యాదు చేశాడు. మంత్రిపై అనుచితంగా పోస్ట్‌పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఓల్డ్ గెస్టుహౌజ్‌లోని పాత భవనంలో మున్సిపల్ నుంచి అనుమతి పొందకుండా చేపడుతున్న నిర్మాణాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్య తీసుకోవాలని సామాజిక కార్యకర్త మీర్జా అస్మత్ అలీబేగ్ నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చట్టం 2019 లోని సెక్షన్ 174 ప్రకారం ఏ నిర్మాణానికైనా మున్సిపల్ నుంచి అనుమతి తీసుకోవాలని, నిబంధనలను ఉల్లంఘించి పనులు చేస్తున్నందున వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

సుభాష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్‌లోని ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శక్తి సదన్ ఆశ్రమంలోని మహిళలకు గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇమ్రాన్ తన వైద్య సిబ్బందితో వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందచేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శక్తిసదన్ సూపరింటెండెంట్ ఏ రమాదేవి, రజిత, వసంత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఫీడర్ల ఏర్పాటు

శంకరపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరడపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ముత్తారం, తాడికల్ (రూరల్) బంచ్‌డ్ ఫీడర్లను వేరుచేసి ప్రతీఫీడర్‌ను ప్రత్యేకంగా వీసీబీఎస్ ఏర్పాటు చేసినట్లు ఏఏ సంపత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ఫీడర్‌కు విద్యుత్‌సమస్య తలెత్తినప్పుడు ఆ ఫీడర్ విద్యుత్‌సరఫరా నిలిపివేసి మిగతా ఫీడర్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన ఒరవడితో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

హుజూరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో నూతన ఒరవడిని తీసుకొచ్చిందని కర్ణాటక హంగల్ శాసనసభ్యుడు శ్రీనివాస్ మనే అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మనే మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంతో కొత్త విధానాన్ని అమలు



మాట్లాడుతున్న కర్ణాటక శాసనసభ్యుడు శ్రీనివాస్ మనే

చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లా అధ్యక్ష ఎంపికను వార్డు, గ్రామ, మండల, నియోజకవర్గస్థాయి నాయకుల అభిప్రాయాలు తెలుసుకొని నియమిస్తామన్నారు. దేశంలోని ఐదురాష్ట్రాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని, తెలంగాణలో కూడా ఈ విధానాన్ని తీసుకువచ్చామన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, టీపీసీసీ పరిశీలకులు మ్యాడం బాలకృష్ణ, హుజూరాబాద్, సైదాపూర్, చిగురుమామిడి మండలాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌కు సహకరించండి

గణేశ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు సహకరించాలని కరీంనగర్ జిల్లా బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు గురువారం పలువురికి వినతిపత్రాలు అందజేశారు. ట్రస్మా కన్వీనర్ సొగాని కొమురయ్యను మర్యాదపూర్వకంగా కలిసి బంద్‌కు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించి బంద్‌కు పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ ఆర్టీసీ ఆర్ఎం రాజుకు వినతిపత్రం అందజేశారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించి బంద్‌కు సహకరిస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు ఎన్నం ప్రకాష్, ఆది మల్లేశం, కేశిపెద్ది శ్రీధర్ రాజు, నాగుల కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు, రంగు సంపత్‌గౌడ్, దొగ్గలి శ్రీధర్, మంతెన కిరణ్, మదాను సంజీవ్, నారోజు రాకేష్ చారి, సిరిశెట్టి రాజేష్, గాలి రవి యాదవ్, నర్సింగోజు శ్రీనివాస్, పెంట శ్రీనివాస్, నితిన్, దేవరకొండ సంతోషి పాల్గొన్నారు.

బంద్‌కు సీపీఐ, ఏఐవైఎఫ్, టీజేఎస్ మద్దతు

భగత్‌నగర్/హుజూరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై ఈ నెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు సీపీఐ, ఏఐవైఎఫ్(అఖిలభారత యువజన సమాఖ్య) సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ వేర్వేరుగా ఒక ప్రకటనలో తెలిపారు. బంద్‌కు టీజేఎస్ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని టీజేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముక్కెర రాజు అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. బంద్‌కు ప్రజాస్వామికవాదులందరూ రాజకీయ పార్టీలకు అతీతంగా మద్దతు పలకాలని కోరారు.

వెన్నెముకపై ఒత్తిడి తగ్గించుకోండి

సుభాష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నడుము నొప్పి వయస్సుతో పాటు చేసే పనినిబట్టి, అదిక బరువు వల్ల కూడా వస్తుందని..వెన్నెముకపై ఒత్తిడి తగ్గించాలని మెడికవర్ ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి సూచించారు. గురువారం వరల్డ్ స్పైన్ డే సందర్భంగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కేఎస్ఆర్ పోలీసు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో హెల్త్‌టాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడుము నొప్పి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మెడికవర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, మనోజ్ అకాడమి నిర్వాహకుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించాలని తద్వారా వ్యాధిని నయం చేయవచ్చని హైదరాబాద్ గ్లెనిగల్స్ ఆసుపత్రి పల్మనాలజిస్టు డాక్టర్ తపస్వికృష్ణ తెలిపారు. గురువారం ఊపిరితిత్తుల సమస్యలపై నగరంలోని సూర్య చెస్ట్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రసమయిపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

గన్నేరువరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎదుగుదలను చూసి ఓర్వలేక నోరు జారితే నాలుక కోస్తాం.. ఖబర్దార్ రసమయి అంటూ రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ మాజీ సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవిందర్‌రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. రసమయి ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు


మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

రామడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం మోతె వాగు బ్రిడ్జి వద్ద మొరం పోయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. మాజీ ఎంపీపీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి హరీష్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా వెంటనే స్పందించి రోడ్డుపైన మొరం పోయించి పూర్తిగా చదును చేయించారు.

ఆస్పత్రిలో వాటా ఇస్తానని ఇవ్వడం లేదు

జమ్మికుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ఓ మల్టీస్పెషాల్టీ ఆసుపత్రిలో తనకు పదిశాతం వాటా ఇస్తామని కొంతమంది వైద్యులు నమ్మించి మోసగించారని ఆరోపిస్తూ పడాల కిరణ్‌గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రి ఎదుట గురువారం బైఠాయించారు. ఆసుపత్రి మెయిన్ గేట్‌కు కుటుంబసభ్యులతో కలిసి ఉన్న ఫ్లెక్సీ అంటించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పడాల కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ జమ్మికుంటలో తనకు 20ఏళ్లుగా ఓ ఆసుపత్రి ఉందని, ఆ సమయంలో పట్టణానికి చెందిన వైద్యుడు ముషం సురేష్ తమ ఆసుపత్రిలో ఓపీ చూసేవారన్నారు. మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి పెడుతున్నామని, అందులో పదిశాతం వాటా ఇస్తామని సదరు వైద్యుడు తనను నమ్మించాడని చెప్పాడు. దీంతో తన ఆసుపత్రి తీసేసి వారితో కలిశానని, తనవద్ద ఉన్న రూ.50లక్షల విలువగల ఆసుపత్రి సామగ్రి వారికి ఇచ్చానని తెలిపాడు. ప్రారంభమైన నెలరోజుల నుంచి తనపై కక్ష కట్టి వేధింపులకు గురిచేసి బయటకు పంపిం చారని ఆవేదన చెందారు. తనకు రావాల్సిన పదిశాతం వాటా డబ్బులు, రూ.50లక్షల ఆసుపత్రి సామగ్రి ఇవ్వకుండా బెదిరిస్తున్నా రన్నారు. న్యాయం జరిగే వరకు నిరసన కార్యక్రమం చేపడుతామ ని తెలిపాడు.

'స్థానిక ఎన్నికలపై గందరగోళం సృష్టిస్తున్న ప్రభుత్వం'

భగత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ ప్రభుత్వం గందరగోళం సృష్టించిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడు బొంతల కళ్యాణ్‌చంద్ర ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా గ్రామ పాలనను గాడిలో పెట్టే ఆలోచన చేయక పోవడం దురదృష్టకరమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామన్న రేవంత్ సర్కార్‌కు హైకోర్టు, సుప్రీంకోర్టు షాకిచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి చూస్తుంటే ఇప్పట్లో స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదనేది స్పష్టంగా అర్థమవుతుందన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

సైదాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం 146పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సీహెచ్ విజేందర్‌రావు తెలిపారు. శుక్రవారం జాగీర్‌పల్లిలో పశువులకు టీకాలు వేస్తామని, పాడిరైతులు తమ పశువులతోపాటు ఆధార్‌కార్డ్, సెల్‌ఫోన్ వెంట తీసుకురావాలని సూచించారు. టీకాలు వేసిన వివరాలు భారత్ పశుధాన్ యాప్‌లో నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన

సైదాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై సీడీపీవో సుగుణ తల్లులకు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని రాంచంద్రాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సీడీపీవో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె తల్లులు, పిల్లలకు మత్తుపదార్థాల వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో ప్రవళిక, సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పోషణమాసం ముగింపు కార్యక్రమం

శంకరపట్నం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం రైతువేదికలో గురువారం పోషణమాసం ముగింపు కార్యక్రమం సీడీపీవో శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన జిల్లాసంక్షేమాధికారి సరస్వతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అవసరమైన పోషకాహారం తప్పకుండా తీసుకోవాలన్నారు.

అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు మాట్లాడుతూ ప్రతిగర్భిణీ సమయానికి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఐరన్ టాబ్లెట్లు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ నాగరాజు, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ రోమీల, బ్లాక్ కో-ఆర్డినేటర్ ప్రణీత, ఎంపీడీవో కృష్ణప్రసాద్, తహసీల్దార్ సురేఖ, తదితరులు పాల్గొన్నారు.



రాంచంద్రాపూర్‌లో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సీడీపీవో సుగుణ

● సంక్షిప్తం..

హుజూరాబాద్/జమ్మికుంట: పట్టణంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీపీఆర్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది గుండె పోటు వచ్చిన సమయంలో సీపీఆర్ చేసి ఎలా బతికించవచ్చో విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు.

హుజూరాబాద్: ఇండేన్ గ్యాస్ లబ్ధిదారులు తప్పకుండా ఈకేవైసీ చేసుకొని గ్యాస్ సబ్సిడీలకు అర్హత పొందాలని తెలంగాణ ఎల్పీజీ డీలర్ల సంఘం అధికార ప్రతినిధి పీవీ మదన్‌మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిమ్మాపూర్: అలుగునూర్‌లో నవంబరు 6న స్వయంభూ లక్ష్మీగణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కంది అశోక్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వానపత్రికను గ్రామస్థులతో కలిసి ఆవిష్కరించారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలోని న్యూమిలీనియం ప్లేస్కూల్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మునిపట్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు తమ ఆలోచన శక్తి, ప్రతిభను ప్రదర్శించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ట్రస్మా అధ్యక్షుడు సంపత్‌రావు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ వరుణ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చునూరులో రోడ్డుపై ధాన్యం ఆరబోత


పచ్చునూరులో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

మానకొండూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చునూరు, రంగపేట, దేవంపల్లి, లలితాపూర్ గ్రామాల్లోని రోడ్లపై ఆయా గ్రామాల రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం వీణవంక మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు కరీంనగర్ నుంచి ఇంటికి తిరిగివస్తూ రాత్రివేళలో పచ్చునూర్‌లో రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్ప కనిపించకపోవడంతో అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో భార్య మృతి చెందింది. రైతులు ఈఏడాది కూడా రోడ్డుపైనే ధాన్యం ఆరబోయడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

'అల్ఫోర్స్'లో ముందస్తు దీపావళి సంబురాలు

భగత్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ముందస్తు దీపావళి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిగురుమామిడి ఎంపీడీవోగా విజయ్‌కుమార్



చిగురుమామిడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి ఎంపీడీవోగా టి విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన మధుసూదన్‌ను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కలెక్టర్ సస్పెండ్ చేశారు. అదేవిధంగా బి కిరణ్‌కుమార్ ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి జమ్మికుంటకు బదిలీపై వెళ్లారు.

గన్నేరువరం ఎంపీడీవోగా శ్రీనివాస్‌రెడ్డి



గన్నేరువరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలానికి ఎంపీడీవోగా శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చిన శ్రీనివాస్‌రెడ్డికి మండల పరిషత్ సిబ్బంది స్వాగతం పలికారు.

'శ్రీచైతన్య' లో ఓరియంటేషన్ ప్రోగ్రాం

తిమ్మాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో కొత్తగా ప్రథమ సంవత్సరంలో చేరిన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

'వాగేశ్వరి'లో..

తిమ్మాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొదటి సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్‌లో చేరిన విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల జనరల్ సెక్రెటరీ గంధ్ర శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల జాయింట్ సెక్రెటరీ డి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు మహిళా డిగ్రీ కళాశాలలో 'ఫేరియా ఫియెస్టా-2

గణేశ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రాంగణంలో శుక్రవారం జరగనున్న 'ఫేరియా ఫియెస్టా -2, స్వదేశీ ఉత్సవం (క్యాంపస్ ఎకో బజార్ ఫర్ స్వదేశీ దీపావళి) కార్యక్రమం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి వరలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు, స్టార్టప్‌లు, యువ వ్యాపారులు, పర్యావరణ హిత ఉత్పత్తుల తయారీదారులు, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త డా. మనోజ్ కుమార్ ఉన్నారు.


ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు

చిగురుమామిడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. రైతులు సమన్వయం పాటించాలని కోసిన వరి పంటను ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వెళ్లి ఆరబెట్టాలన్నారు. కొనుగోలు సెంటర్ల విషయమై వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

గన్నేరువరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. వరికోతలు మొదలైనా అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారని అన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీశైలం, నాయకులు అంజిరెడ్డి, మల్లయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట వాసికి కామర్స్‌లో డాక్టరేట్


బి గట్టయ్య

ఇల్లందకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన బక్కతట్ల గట్టయ్య ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగంలో గురువారం డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ చెన్నప్ప పర్యవేక్షణలో 'ఈ-నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ ఇన్ తెలంగాణ ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై గట్టయ్య చేసిన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు ప్రకటించారు. ప్రస్తుతం గట్టయ్య హనుమకొండలోని బీమారంలో ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాలలో డైరెక్టర్‌గా కొనసాగుతు న్నారు. గట్టయ్యను పలువురు అభినందించారు.

వెదిరలో ఉచిత వైద్యశిబిరం

రామడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రామడుగు మండలం వెదిరలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, కార్యదర్శి మల్లికార్జున్, పన్యాల అశోక్‌రెడ్డి, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, గూడూరి మహేష్ పాల్గొన్నారు.

238.4 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణ శివారులోని ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 238.4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం సీజ్ చేశారు. విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ సీఐ అనిల్, ఎస్సై వరుణ్ ప్రసాద్ విశ్వసనీయ సమాచారం మేరకు మిల్లులో తనిఖీ చేసి 238.4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని హుజూరాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపరిచారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయిస్ డీటీ వసంతరావు, ఇల్లందుల వినోద్ పాల్గొన్నారు.